

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి
తొమ్మిది మందికి గాయాలు
కందిలో ఆర్టీసీ బస్సు, తూఫాన్ వాహనం ఢీ..
ఒకరు మృతి, నలుగురికి గాయాలు
కొమురవెల్లిలో బైకును లారీ ఢీకొనడంతో
మహిళ దుర్మరణం 7



వన్యప్రాణుల గణనపై శిక్షణలో అటవీశాఖ ఉద్యోగులు (ఫైల్)

పక్కాగా వన్యప్రాణుల లెక్క

అటవీశాఖ ఉద్యోగులకు శిక్షణ పూర్తి
వచ్చే నెలలో లెక్కింపు ప్రారంభం
వారం రోజుల పాటు కొనసాగనున్న గణన

మెదక్ అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వచ్చే నెలలో నిర్వహించే గణనకు అటవీశాఖ యంత్రాంగం సమాయత్తం అవుతుంది. దేశవ్యాప్తంగా పులులు, వన్యప్రాణుల లెక్క తేల్చేందుకు అటవీశాఖ ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్-2026 చేపడుతోంది. ఇందుకోసం జిల్లాలోని అటవీశాఖలోని అన్నిస్థాయిల అధికారులు, సిబ్బందికి ఈ నెల 2న రామాయంపేటలో శిక్షణ ఇచ్చారు. సాంకేతిక అంశాలను సద్వినియోగం చేసుకొని, ఎలా పరిశీలన జరిపి గణించాలన్న దానిపై అవగాహన కల్పించారు.

మెదక్ జిల్లాలో 10 చిరుతపులులు

మెదక్ జిల్లాలో అటవీ విస్తీర్ణం 57,626 హెకార్లు ఉంది. మెదక్, రామాయంపేట, తూప్రాన్, నర్సాపూర్, కౌడిపల్లి, పెద్ద శంకరంపేటలో రేంజ్‌ల పరిధిలో సెక్షన్‌లు 27, బీట్‌లు 123 ఉన్నాయి. కొన్నాళ్ల కింద జిల్లాలో పెద్దపులి అడుగులను గుర్తించి, ఆచూకీ కోసం అటవీ అధికారులు, సిబ్బంది గాలించారు. అయినా పులికి సంబంధించిన ఆధారాలు లభించలేదు. జిల్లాలో 10 చిరుత పులులున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు.

ప్రతి రోజూ 5 కిలోమీటర్లు

వన్యప్రాణుల లెక్కింపులో భాగంగా వారం రోజుల పాటు జిల్లాలో ఏయే రకాల వన్యప్రాణులు, ఎన్ని ఉన్నాయో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా లెక్క తేల్చనున్నారు. ఒక్కో బీట్ ప్రాంతాన్ని యూనిట్‌గా తీసుకొని ప్రతీ రోజు ఐదు కిలోమీటర్ల వరకు గణన చేపట్టనున్నారు. మొదటి మూడురోజుల పాటు మాంసాహార, అనంతరం శాఖాహార జంతువులను లెక్కిస్తారు. వన్యప్రాణుల లెక్క తేల్చిన తర్వాత వాటి సంరక్షణ కోసం ప్రణాళిక రూపొందించి అమలు చేస్తారు.

వన్యప్రాణుల గణనపై శిక్షణ పూర్తి

-జోజీ, మెదక్ జిల్లా అటవీశాఖాధికారి

జిల్లాలో వచ్చే నెల జరుగనున్న వన్యప్రాణుల గణనపై అధికారులు, సిబ్బందికి శిక్షణ పూర్తి చేశాం. క్షేత్రస్థాయిలో ఎలా పరిశీలన జరిపి గణించాలన్న దానిపై అవగాహన కల్పించాం. వన్యప్రాణుల గణనలో వలంటీర్లుగా పాల్గొనేందు డిగ్రీ స్థాయి విద్యార్థులు సంప్రదించాలి. బీట్ అధికారుల కొరతను అధిగమించేందుకు 25 మంది సేవలను వినియోగించుకుంటాం. పది రోజులు ముందు ప్రకటన ఇస్తాం.

నిమ్జ.. నీరసం..

కదలిక లేని జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి

ఎక్కడికక్కడ నిలిచిన భూసేకరణ
కొత్త పరిశ్రమల ఏర్పాటుపై నీలినీడలు
12వేల ఎకరాల భూసేకరణలో సగమే పూర్తి
ఇండస్ట్రియల్ కారిడార్ నేపథ్యంలో భారీగా పెట్టుబడులు

ఇదిగో నిమ్జ్.. అదిగో ఉద్యోగాలు అంటూ అరచేతిలో విశ్వం చూపించిన తరహాలో ఉంది నిమ్జ్ పరిస్థితి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో తలపెట్టిన నిమ్జ్ భూసేకరణ నత్తనడకన జరుగుతుంది. ఇప్పటివరకు సుమారు ఆరుగురు డిప్యూటీ కలెక్టర్లు, ఎందరెందరో సిబ్బంది మారినా భూసేకరణ ప్రక్రియ మాత్రం ముందుకు సాగడంలేదు.



పరిహారం కోసం అధికారులను నిలదీస్తున్న రైతులు

మూడునెలలుగా తిరుగుతున్నా..



సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం బసంతాపూర్‌లో నాకున్న మూడెకరాల భూమి నిమ్జ్‌లో పోయింది. ఓవైపు భూమి పోయిందని బాధపడాలా, మరోవైపు పరిహారం ఇవ్వడం లేదని బాధపడాలో అంతుపట్టడం లేదు. గ్రామంలో నా పేరుతో ఇంకా వ్యక్తులు ఉన్నారు. వారు, వారి బంధువులు అభ్యంతరాలు చెప్పడంతో అధికారులు పరిహారం ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారు. మూడు నెలలుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. ఒక అధికారి ఉంటే.. మరో అధికారి ఉండటం లేదు.

-ముంగి బాలప్ప (మామిడిగి-న్యాల్‌కల్)

జహీరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ డివిజన్‌లో 12,635 ఎకరాల్లో 31వేల కోట్ల పెట్టుబడుల వ్యయంతో 2012-13లో నిమ్జ్ (జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి)ని ప్రారంభించారు. 13 ఏళ్ల క్రితం ఈ ప్రాజెక్టును తలపెట్టినా అధికార యంత్రాంగం కనీసం 12,635 ఎకరాల భూమిని సేకరించడం లేదంటే వారి పనితీరు ఏ విధంగా ఉందనేది అవగతమవుతుంది. ఓవైపు రైతులకు పరిహారం అందించడంలో జాప్యం, మరోవైపు అధికారులు క్షేత్రస్థాయిలో రైతులను సముదాయించడంలో విఫలం కావడం మూలంగా నిమ్జ్ భూసేకరణ ముందుకు సాగడం లేదు. ప్రభుత్వాలు నిమ్జ్ పనులు ఊపందుకున్నాయని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. 13 ఏళ్లలో అధికారులు ఇప్పటివరకు ఏడు వేల ఎకరాలు మాత్రమే సేకరించడం గమనార్హం. జహీరాబాద్ ప్రాంతంలో రోజురోజుకూ భూముల విలువలు పెరుగుతున్నాయి. వ్యవసాయ భూములకు మరింత డిమాండ్ ఏర్పడింది. దీంతో, కొందరు రైతులు భూములు ఇవ్వడానికి ముందుకు వస్తే, మరికొందరు ఆసక్తిని చూపడంలేదు. కాగితాల్లో చూపిస్తున్న అభివృద్ధి పనులు, కార్యక్రమాలు ఇప్పట్లో పూర్తయ్యేనా అంటూ పలువురు సందేహాలను వ్యక్తం చేస్తున్నారు.

భూసేకరణ ఇలా

2012-13లో ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో నిమ్జ్ ఏర్పాటుకు పాలకులు, అధికారులు శ్రీకారం చుట్టారు. అప్పట్లో రూ.31వేల కోట్ల పెట్టుబడులతో 12,635, ఎకరాల భూసేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, ఇప్పటి వరకు అధికారులు సేకరించింది 7వేల పైచిలుకు ఎకరాలుగా ఉంది. 2016-17 నుంచి భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఆయా మండలాల్లోని 17 గ్రామాల్లో 7,045 మంది రైతులనుండి 12,635 ఎకరాల భూసేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. నిమ్జ్ పరిధిలోని 17గ్రామాలకు గాను వివిధ గ్రామాల్లో ఇప్పటివరకు

మిగతా 8వ పేజీలో





గుర్తింపు పొందిన క్రీడా సంఘాల వివరాలివ్వండి

డీవైఎస్‌వోకు శాట్స్ ఆదేశం

సంగారెడ్డి అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో క్రీడా సంఘాలు ఎన్ని ఉన్నాయి. వాటిలో ఉన్న సభ్యులెందరు, వారి పేర్లతో కూడిన సమగ్ర వివరాలు పంపాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్(శాట్స్) జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారిని ఆదేశించింది. దీంతో ఆ శాఖ జిల్లా అధికారి 17 క్రీడా సంఘాల వివరాలతో కూడిన జాబితాను శాట్స్‌కు నివేదించారు. ఇదిలా ఉంటే జిల్లాలో క్రీడలతో సంబంధం లేని చాలా మంది వ్యక్తులు తమదే గుర్తింపు కలిగిన క్రీడా సంఘంగా వ్యవహరిస్తూ చెలామణి అవుతున్నారనే ఆరోపణలున్నాయి. వాస్తవానికి కొన్ని క్రీడా సంఘాల నాయకులు సుమారుగా ఇరవై సంవత్సరాలుగా ఒకరిద్దరే కొనసాగుతున్నారనే విమర్శలున్నాయి. గుర్తింపు లేని అసోసియేషన్లతో క్రీడా రంగంతో పాటు క్రీడాకారుల భవిష్యత్‌పై ప్రశ్నార్థకంగా మారుతున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే గుర్తింపు లేని సంఘాలను చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈమేరకు నివేదిక కోరినట్టు తెలుస్తోంది. నూతన క్రీడా పాలసీలో భాగంగానే శాట్స్ ఈమేరకు సమాచారం సేకరిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. కాగా శాట్స్ ఆదేశాల మేరకు జిల్లా యువజన క్రీడల శాఖ గుర్తింపు కలిగిన క్రీడా సంఘాల వివరాలతో కూడిన జాబితాను మల్లగుల్లాలుపడి శాట్స్‌కు నివేదించినట్టు తెలిసింది. వాటి సమగ్ర వివరాలు తెలపాలని 'ఆంధ్రజ్యోతి' కోరగా డీవైఎస్‌వో ఆసక్తి చూపకుండా దాటవేశారు.

చేప... వస్తోంది

ఎట్టకేలకు విత్తనం పంపిణీ టెండర్ల ప్రక్రియ పూర్తి
1,728 చెరువుల్లో 5.32 కోట్ల చేపపిల్లల పంపిణీకి మత్స్యశాఖ ఏర్పాట్లు
మెదక్ జిల్లాలో 309 మత్స్య సహకార సొసైటీల సభ్యులకు ప్రయోజనం
నేడు కోంటూర్ చెరువులో సీడ్ విడుదల
నెలల తరబడి ఆలస్యం.. ఎదుగుదలపై ప్రభావం చూపే అవకాశం



మెదక్ అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో ఉచిత చేప పిల్లల పంపిణీ ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభం కానుంది. సుదీర్ఘ ప్రక్రియ అనంతరం టెండర్ల ప్రక్రియ కొలిక్కి వచ్చింది. టెండర్లు దక్కించుకున్న రాజా ఫిషరీస్, శివ సీడ్‌ఫామ్ కాంట్రాక్టు దక్కించుకున్నారు. నేడు మెదక్ మండల పరిధిలోని కోంటూర్ చెరువులో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సీడ్‌ను విడుదల చేయనున్నారు. అయితే సీడ్ విడుదలలో జాప్యం చేప పిల్లల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపే అకాశముందని మత్స్యకారులు పేర్కొంటున్నారు.

సొసైటీల్లో 16,820 మంది సభ్యులు

మెదక్ జిల్లాలో మొత్తం 309 మత్స్య సహకార సొసైటీలు ఉన్నాయి. ఈ సొసైటీల్లో 16,820 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికీ ఆయా గ్రామాల పరిధిలోని చెరువుల్లో వీరికి చేపలు పట్టుకునేందుకు సర్కారు ప్రతి ఏటా ఉచితంగా చేప పిల్లలను అందిస్తోంది. జిల్లాలో 1,728 చెరువుల్లో 5.32 కోట్ల చేప పిల్లల విడుదల చేసేందుకు మత్స్యశాఖ నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు దీర్ఘకాలం, స్వల్పకాలం నీటి సౌకర్యం ఉండే చెరువులను గుర్తించి వివిధ సైజుల్లో చేప పిల్లలను వదిలేందుకు చర్యలు తీసుకుంటున్నారు. 35-40 మిల్లీమీటర్ల సైజు విత్తనం 3.99 కోట్లు, 80-100 మిల్లీమీటర్ల సైజు చేప పిల్లలు 1.32 కోట్లు పంపిణీ చేయనున్నారు.

ఈసారీ ఆలస్యమే..

జిల్లాలో చేప పిల్లల పంపిణీ ప్రక్రియ ఈ సంవత్సరం కూడా ఆలస్యమైంది. దీంతో, చేప పిల్లల ఎదుగుదల తక్కువ ఉంటుందని మత్స్య సొసైటీ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఆలస్యం కారణంగా గతంలో నాణ్యత లేని చేప పిల్లలను చెరువుల్లో వదిలినట్లు విమర్శలున్నాయి. ఈసారి నాణ్యమైన విత్తనం పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

నేటి నుంచి ప్రారంభం



జిల్లాలో చేప పిల్లల పంపిణీకి రెండు మూడుసార్లు టెండర్ల ప్రక్రియ నిర్వహించగా బిడ్లు దాఖలు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో, ఖమ్మం, భద్రాది కొత్తగూడెం, నల్గొండ, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన రాజా ఫిషరీస్, శివ సీడ్ ఫామ్ సంస్థలకు మెదక్ జిల్లాను అలాట్ చేశారు. ఈమేరకు చెరువుల్లో చేప పిల్లల పంపిణీకి ఏర్పాట్లు చేశాం. ఈ రోజు కోంటూర్ చెరువులో చేప పిల్లలను విడుదల చేస్తాం.

-మల్లేశం, మెదక్ జిల్లా మత్స్యశాఖ అధికారి



వెంకటాపూర్‌లో పది రోజులుగా నీటిలోనే ఉండటంతో మొలకలు వస్తున్న వరి పంటను చూపుతున్న రైతులు

పది రోజులైనా
వరదలోనే పొలం

కోతకొచ్చిన వరి పంట నీటి పాలు

నారాయణఖేడ్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తగ్గినా.. వరద ప్రభావం మాత్రం తగ్గలేదు. పది రోజులైన పొలం నీటిలోనే మునిగి ఉండటంతో అన్నదాతకు తీరని నష్టం కలిగింది. నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్‌లో పెద్దచెరువు ఆయకట్టు 30 ఎకరాల్లో వరి పంట వరదపాలైంది. ఇందులో పదెకరాలు నీటిలోనే ఉండటంతో వరి కంకులు మొలకలు వస్తున్నాయి. మచ్చ్యారి లింగన్న, సాయిలు, లతీఫ్, వడ్ల నర్సింహులుకు చెందిన పది ఎకరాల్లో పంట పూర్తిగా నీటి పాలైంది. ఎకరాకు రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టామని, పరిస్థితులు అనుకూలిస్తే ఎకరాకు 35 క్వింటాళ్ల ధాన్యం వచ్చేదని రైతులు పేర్కొన్నారు. పదెకరాల్లో పూర్తిగా, 20 ఎకరాల్లో పాక్షికంగా పంట దెబ్బతిన్నదని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

పట్టింపులేక పడావు...

శిథిలావస్థకు సంగారెడ్డి హెరిటేజ్ జైలు మ్యూజియం

చెదిరిపోతున్న 230 ఏళ్ల వారసత్వ సంపద
ఆదరణ లేక మూతపడిన జైలు మ్యూజియం
ప్రభుత్వం దృష్టిసారిస్తే వారసత్వ కట్టడం పదిలం



సంగారెడ్డిలో శిథిలావస్థకు చేరిన హెరిటేజ్ జైలు మ్యూజియం

సంగారెడ్డి అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని 230 ఏళ్ల చరిత్ర కలిగిన హెరిటేజ్ జైలు మ్యూజియం పర్యవేక్షణ లేక పడావు పడుతున్నది. ఈ వారసత్వ కట్టడం ఆదరణ లేక క్రమక్రమంగా కూలిపోతున్నది. ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో 1,796లో ఈ జైలు భవనాన్ని నిర్మించారు. మారుతున్న అవసరాలకు అనుగుణంగా కంది శివారులో నిర్మించిన నూతన నూతన భవనంలోని 2012లో జిల్లా జైలును తరలించారు. ఈ నేపథ్యంలో పాత జిల్లా జైలును 2016 జూన్ 5న హెరిటేజ్ జైలు మ్యూజియంగా మార్చగా కొంత కాలంగా పర్యవేక్షణలేక మూతబడింది.

సంస్కరణలకు నాంది

జైళ్లశాఖ డీజీగా వీకే సింగ్ ఉన్న క్రమంలో పలు సంస్కరణలకు నాంది పలికారు. ఇందులో భాగంగా 2016 జూన్ 5న సంగారెడ్డిలోని పాత జిల్లా జైలును హెరిటేజ్ జైలు మ్యూజియంగా తీర్చిదిద్దారు. ఏళ్ల నాటి చరిత్ర కలిగిన ఈ జైలు మ్యూజియంలో పురాతన శిక్షలకు సంబంధించిన ఆనవాళ్లు, కఠిన శిక్షల గురించిన చిత్రాలను అమర్చారు. పాత తరం జైళ్లలో వినియోగించిన పనిముట్లు, పరికరాలు, ఖైదీలు వినియోగించే వస్తువులను ప్రదర్శనకు పెట్టారు. అలాగే మసాజ్ చేసుకునేందుకు వీలుగా కేరళ ఆయుర్వేదిక్ విలేజ్‌ను కూడా ఏర్పాటు చేశారు. అంతేకాకుండా 'ఫీల్ ది జైల్' పేరిట రూ.500 చెల్లిస్తే ఒక రోజంతా ఖైదీ మాదిరిగా కారాగారంలో గడిపే అవకాశం ఈ మ్యూజియంలో కల్పించారు. ఎంతో మంది ప్రముఖులు, వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి ఒక రోజు జైలులో ఉండే అనుభూతిని పొంది వెళ్లారు. పలు సినిమాలు, షార్ట్ ఫిలిమ్స్, ఆల్బమ్స్ చిత్రీకరణకు ఈ మ్యూజియం వేదికగా మారింది.

ఆధునీకరిస్తే వారసత్వం పదిలం

సంగారెడ్డి పట్టణంలోని హెరిటేజ్ జైలు మ్యూజియం సుమారు నాలుగున్నర ఎకరాల్లో ఉంది. మ్యూజియం వెనకాల జైళ్ల శాఖకు చెందిన కొంత స్థలంలో 2019 నుంచి బీపీసీఎల్ పెట్రోల్ బంక్ కొనసాగిస్తున్నారు. ఇదే మ్యూజియం భవనంలో ప్రస్తుతం ఉమ్మడి జిల్లా సబ్‌జైళ్ల అధికారి (డీఎస్‌జేవో) కార్యాలయం కొంత కాలంగా కొనసాగుతున్నది. అయితే ఈ మ్యూజియం ఒక పక్క నుంచి కూలిపోతూ శిథిలావస్థకు చేరుతుండడంతో ఆ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. మ్యూజియంలోని పలు బ్యారక్‌లు కూలిపోతున్నాయి. అంతకుముందే 'మైనేషన్ కేరళ ఆయుర్వేదిక్ విలేజ్' పేరిట ఏర్పాటు చేసిన మసాజ్ కేంద్రం మూతపడింది. ఇంతలో కరోనా కాలం రావడంతో షూటింగ్‌లు కూడా నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఏటా వర్షాలకు క్రమంగా మ్యూజియం కూలిపోయి శిథిలావస్థకు చేరి ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. ఇందులోని సామగ్రిని కూడా ఇప్పటికే కందిలోని సెంట్రల్ జైలుకు తరలించారు. ఇప్పటికైన ప్రభుత్వం ఈ వారసత్వ కట్టడాన్ని ఆధునీకరించి ఇతర అవసరాలకు వినియోగిస్తే వారసత్వ కట్టడం పదిలంగా ఉంటుందని పేర్కొంటున్నారు.



సంగారెడ్డిలోని వెల్‌నెస్ సెంటర్

వెల్‌నెస్ సెంటర్ పర్యవేక్షణ బాధ్యతలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు

డీఎంఈ పరిధిలోకి తీసుకొస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు

సంగారెడ్డి అర్బన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, జర్నలిస్టుల ఆరోగ్య పథకం (ఈజేహెచ్‌ఎస్, ఈహెచ్‌ఎస్) వెల్‌నెస్ సెంటర్లను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)పరిధిలోకి తీసుకొస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వెల్‌నెస్ సెంటర్ల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌లకు ఆదేశించింది. దీంతో సంగారెడ్డిలోని వెల్‌నెస్ సెంటర్ పర్యవేక్షణ బాధ్యతలను ఇకపై డీఎంఈ పరిధిలో (జీజీహెచ్ సూపరింటెండెంట్) కొనసాగుతాయి. హెచ్‌ఆర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ అసిస్టెంట్ వంటి నాన్ మెడికల్ అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది నియామక బాధ్యతలను రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్టుకు ప్రభుత్వం అప్పగించింది. మందులు, పరికరాలు, మరమ్మతుల నిర్వహణ కూడా ట్రస్టు ద్వారా చేపట్టనున్నారు. అయితే ఈ కేంద్రాల్లో వైద్య నిపుణులు, అధికారులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బందిని డీఎంఈ పరిధిలో నియమించుకోవచ్చని స్పష్టం చేసింది. బోధనాస్పత్రుల్లోని ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను ఈ కేంద్రాల్లోనూ వినియోగించుకోవచ్చని పేర్కొంది. ప్రస్తుతం ఉన్న సిబ్బందిని తొలగించకుండానే కేంద్రాల నిర్వహణకు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించింది. వెల్‌నెస్ సెంటర్లు గత సర్కారు ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ బాధ్యతలు ఎవరు చూసుకోవాలనే అంశాన్ని స్పష్టంగా పేర్కొనలేదు. దీంతో, ఏదైనా సమస్య వచ్చినపుడు తమది కాదని ఓవైపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, మరోవైపు ఆరోగ్యశ్రీ ట్రస్టు, జీజీహెచ్ అధికారులు చేతులెత్తేసే వారు. తాజాగా ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలతో ఇక నుంచి నిర్వహణ బాధ్యత, పర్యవేక్షణ, ప్రణాళికలు, కార్యాచరణను మెడికల్ సూపరింటెండెంట్ పర్యవేక్షించనున్నారు.

తూప్రాన్ ఆసుపత్రికి బెస్ట్ సెంటర్ అవార్డు

డయాలసిస్ సేవల్లో కేంద్రం ప్రకటన



తూప్రాన్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి): డయాలసిస్ కేంద్రాల నిర్వహణలో తూప్రాన్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి (సీహెచ్‌సీ) జాతీయ స్థాయిలో బెస్ట్ సెంటర్ అవార్డును దక్కించుకుంది. దేశంలో ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ల నిర్వహణపై 14 కేంద్రాలు బెస్ట్ సెంటర్ అవార్డుకు ఎంపికచేశారు. డయాలసిస్ కేంద్రాల నిర్వహణలో రాష్ట్రం నుంచి మూడు ఆసుపత్రులు ఎంపిక చేశారు. ఏరియా ఆసుపత్రుల్లో దుబ్బాక, అచ్చంపేట ఎంపిక కాగా, సామాజిక ఆరోగ్య కేంద్రం జాబితాలో తూప్రాన్ ఆసుపత్రి అవార్డుకు ఎంపికయ్యింది.

మెదక్ సీఎస్ఐ పాస్‌నేట్‌లో సంపత్ ప్యానెల్ ఘన విజయం!

- 20 మంది సభ్యులకు 13 మంది సంపత్ ప్యానెల్ సభ్యుల గెలుపు
- మూడేళ్ల పాటు పదవిలో కొనసాగనున్న నూతన కమిటీ



ఆదివారం ప్రత్యేక ప్రార్థనల్లో నూతన సభ్యులు

మెదక్ కల్చరల్, నవంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : మెదక్ సీఎస్ఐ (చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా) పాస్‌నేట్ ఎన్నికలు శనివారం మెదక్ చర్చి ప్రాంగణంలోని సండే స్కూల్ హాల్‌లో జరిగాయి. మినిస్టీరియల్ కమీషనరీ విల్సన్, డీసీసీ వైస్ చైర్మన్ జేసుదాస్, ప్రెస్‌బీటర్ ఇన్‌చార్జి శాంతయ్య పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించబడ్డాయి. చర్చి ప్రాంగణంలో ఓటర్లు, పోటీదారులు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో సందడిగా మారింది. ఈ ఎన్నికల్లో మొత్తం 20 మంది సభ్యుల ఎంపిక కోసం మూడు ప్యానెళ్లకు చెందిన 60 మంది పోటీలో నిలిచారు. సంఘానికి చెందిన సుమారు 1712 మంది సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రెసెంటింగ్ ఆఫీసర్లుగా పద్మారావు, జ్ఞానప్రసాద్, దాదాపు 50 మంది ఎన్నికల సిబ్బందితో పోలింగ్ ప్రక్రియ సజావుగా పూర్తయింది. పోలింగ్ అనంతరం ప్రారంభమైన కౌంటింగ్ ప్రక్రియ శనివారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల్లో గంట సంపత్ ప్యానెల్ విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ ప్యానెల్‌కు చెందిన మొత్తం 20 స్థానాల్లో అత్యధికంగా 13 మంది సభ్యులు గెలుపొందారు. ఇతర ప్యానెల్‌లకు చెందిన ఏడుగురు సభ్యులు విజయం సాధించారు. మొత్తం 20 మంది సభ్యులతో కూడిన ఈ నూతన కమిటీ పదవి కాలం మూడు సంవత్సరాల పాటు కొనసాగనుంది. గెలుపొందిన సభ్యులను వారి మద్దతుదారులు, అనుచరులు ఘనంగా సన్మానించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు డీఎస్పీ ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

గెలుపొందిన సభ్యులు వీరే...

గంట సంపత్, సువాన్ డగ్లస్, మెట్టు దేవప్రకాశం, భైరామ్ సునీల్, గొల్లబోయిన సునీల్, మంగ సురేందర్, ఆరే ప్రభుదాస్, బిట్ల ప్రభుదయానంద్, ఆకుల మాణిక్యరావు, నీరుడి ఫ్రాంక్ జాన్సన్, పీక్ మోసెస్ మనోహర్, గండిబోయిన శాంసన్ సందీప్, పాతా లిల్లీ గ్రేస్, సోమ జాకబ్ ఫ్రాన్సిస్, ముల్కి శ్రీకాంత్ కుమార్, బచ్చోళ్ల అనంతరావు, మార్కిలి జోయెల్ సామ్ బెనెడిక్ట్, జానపతి వరప్రసాద్, వేముల శ్రీనివాస్, అమ్మిపురం శాంతి సుమమాల

ఇంత అధ్వానమా?

ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరి, వాటి ప్రాంగణాలు అధ్వానంగా మారాయి. మెదక్, సంగారెడ్డి జిల్లాల్లోని పలు మండలాల్లో కార్యాలయాల దుస్థితి ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని కళ్లకు కడుతోంది. నర్సాపూర్, జహీరాబాద్, మునిపల్లిలో ప్రభుత్వ భవనాలు కూలుతున్నా, చెత్తచెదారంతో అధ్వానంగా మారుతున్నా వాటిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు.

\- నర్సాపూర్/జహీరాబాద్/మునిపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి)

అస్తవ్యస్తంగా ప్రభుత్వ కార్యాలయాలు

- నర్సాపూర్‌లో విషపురుగుల అడ్డాగా ఎంపీడీవో ప్రాంగణం
- జహీరాబాద్‌లో ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు తాళం
- మునిపల్లిలో శిథిలావస్థలో ఎంపీడీవో ఆఫీస్

అపరిశుభ్రతకు నిలయాలు

జహీరాబాద్ పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు అపరిశుభ్రతకు నిలయాలుగా మారాయి. కార్యాలయం అంతర్భాగంతో పాటు పరిసర ప్రాంతాల్లో చెట్ల ఆకులు, పిచ్చిమొక్కలు పేరుకుపోయి మురికిగా కనిపిస్తున్నాయి. గతంలో పచ్చదనం, పరిశుభ్రత పేరుతో శ్రమదానం కార్యక్రమాలు నిర్వహించిన అధికారులు, ప్రస్తుతం ఆ దిశగా దృష్టి పెట్టడం లేదు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ప్రాంగణం చెత్త, పిచ్చిమొక్కలు, చిత్తుకాగితాలతో పేరుకుపోయి దుర్భరంగా మారింది. కాసేపు సేద తీరడానికి వీలుగా ఉన్న ఈ గెస్ట్‌హౌస్‌కు సంబంధిత అధికారులు గేటుకు తాళం వేసి ఉంచారు. దీంతో ప్రముఖుల కూడా దీనిని ఉపయోగించుకోలేకపోతున్నారు. అటవీశాఖ, ఎంపీడీవో, పంచాయతీరాజ్ వంటి అనేక కార్యాలయాలు అపరిశుభ్రతతో కనిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని కార్యాలయాలకు వచ్చే ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



చెట్ల ఆకులతో జహీరాబాద్‌లోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్



మునిపల్లి ఎంపీడీవో కార్యాలయం గోడకు వచ్చిన తడి

కూలే స్థితిలో ఎంపీడీవో కార్యాలయం

మునిపల్లిలోని ఎంపీడీవో కార్యాలయం శిథిలావస్థకు చేరుకున్నది. ఈ కార్యాలయం 1988లో ప్రారంభమైంది. దశాబ్దాల కిందట నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. వర్షాలకు గోడల నుంచి చెమ్మ వస్తుండటంతో పాటు పెచ్చులూడుతున్నాయి. ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొనడంతో, కార్యాలయానికి వచ్చే ఉద్యోగులు, ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల మండలంలోని లింగంపల్లి గురుకుల సొసైటీ హాస్టల్ భవనం కూలి ముగ్గురు విద్యార్థులు గాయపడిన ఘటన నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన కార్యాలయాల్లో విధులు నిర్వర్తించాలంటేనే ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, పాత ఎంపీడీవో కార్యాలయాన్ని పరిశీలించి వెంటనే నూతన భవనాన్ని నిర్మించాలని ఉద్యోగులు, మండల ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా, మునిపల్లి ఎంపీడీవో కార్యాలయానికి కనీసం బోర్డు కూడా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. తక్షణమే కార్యాలయానికి బోర్డు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మండల పరిషత్ ప్రాంగణంలో కూలుతున్న భవనాలు

పాములు, విషపురుగులు..

నర్సాపూర్ మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం దయనీయ స్థితిలో ఉంది. సుమారు 40 ఏళ్ల క్రితం, మండల వ్యవస్థకు ముందు ఉన్న బ్లాక్ వ్యవస్థ సమయంలో నిర్మించిన ఆరు క్వార్టర్లు ప్రస్తుతం పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (బీడీవో) కార్యాలయంతో పాటు నిర్మించిన ఈ క్వార్టర్లలో గతంలో ఎమ్మెల్యేలు, అధికారులు కూడా నివాసం ఉండేవారు. నేడు వీటిలో ఒకటి (ఒకప్పటి ఎమ్మెల్యే వినియోగించిన క్వార్టర్) మినహా, మిగిలిన నాలుగు క్వార్టర్లు పూర్తిగా కూలిపోయే స్థితికి వచ్చాయి. దీని పరిసర ప్రాంతమంతా పిచ్చిమొక్కలతో, చెత్తాచెదారంతో నిండిపోయి అధ్వానంగా తయారైంది. ఈ ప్రాంతంలోనే ఆర్డీవో, ఎంపీడీవో, వ్యవసాయ శాఖ, పశుసంవర్థక శాఖ వంటి ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, రాత్రింబవళ్లు విద్యార్థినులు ఉండే బాలికల వసతిగృహం ఉన్నా, శిథిల భవనాలను పట్టించుకునేవారు లేరు. ఈ కంపుకొట్టే పరిసరాలతో పాములతో పాటు ఇతర విషపురుగులు సంచరిస్తుండటంతో అటువైపు వెళ్లే ఉద్యోగులు, ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. శిథిల భవనాలను తొలగించి, ఆ స్థలంలో కొత్త ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలని, పిచ్చిమొక్కలు తొలగించి, మొక్కలను నాటాలని ప్రజలు కోరుతున్నారు.



పిచ్చిమొక్కలతో ఉన్న క్వార్టర్స్

15వ ఏట విడిచి వెళ్లి.. 50 ఏళ్లకు తిరిగి వచ్చి



సంగన్నను సన్మానిస్తున్న గ్రామస్థులు, కుటుంబసభ్యులు

ఝరాసంగం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): 50 ఏళ్ల తర్వాత పుట్టిన ఊరిని, ఆప్తులను వెతుక్కుంటూ ఓ వ్యక్తి తిరిగి స్వగ్రామానికి చేరుకున్న సంఘటన సంగారెడ్డి జిల్లా ఝరాసంఘం మండలం బొప్పన్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన కమ్మరి నాగప్ప-మోహనమ్మ దంపతుల చిన్న కుమారుడైన సంగన్న, దాదాపు 50 సంవత్సరాల క్రితం, తన 15వ ఏట కుటుంబాన్ని విడిచి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఆయన గురించి ఎలాంటి సమాచారం లేదు. సంగన్న మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా, మాలేగావ్ తాలూకా, చంద్రమణినగర్‌లో స్థిరపడి, అక్కడే వివాహం చేసుకుని, నలుగురు సంతానంతో జీవనం సాగిస్తున్నారు. అయితే, తరచూ పుట్టిన ఊరు, తల్లిదండ్రులు, చిన్ననాటి స్నేహితులు గుర్తుకు రావడంతో, సంగన్న మహారాష్ట్ర నుంచి వెతుక్కుంటూ ఆదివారం బొప్పాన్‌పల్లి గ్రామానికి చేరుకున్నారు. నేరుగా తమ ఇంటి వద్దకు వెళ్లి కుటుంబసభ్యులను పలకరించారు. పలు ప్రశ్నలతో అతడేనని నిర్ధారించుకున్న కుటుంబసభ్యులు అనంతరం భావోద్వేగంతో సంగన్నను అక్కున చేర్చుకున్నారు.

వైద్యారోగ్య శాఖ ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయాలి

సంగారెడ్డి రూరల్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వైద్యారోగ్య శాఖలో పని చేసే ఉద్యోగులందరికీ కనీస వేతనాలు రూ.26వేలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్మినెంట్, కాంట్రాక్టు ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనమివ్వాలని, పీఆర్సీ, డీఏ బకాయిలు విడుదల చేయాలన్నారు. ప్రతీనెల వేతనాలు సక్రమంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో ఈనెల 18వన నిర్వహించ తలపెట్టిన మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లు పట్టివేత

సిద్దిపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్‌లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సైఫ్ అలీ తెలిపిన వివరాల ప్రకారం చిన్నకోడూరు మండలం మల్లారం, చెర్లఅంకిరెడ్డిపల్లి గ్రామాల శివారులోని వాగుల నుంచి ఆదివారం ట్రాక్టర్‌లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. ట్రాక్టర్‌లను స్వాధీనం చేసుకోని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజామానులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

రహదారులు నెత్తురోడాయి. ఆదివారం ఉమ్మడి జిల్లాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందగా, తొమ్మిది మందికి గాయాలయ్యాయి. సంగారెడ్డి జిల్లా కందిలో హైవే 65పై ఆర్టీసీ బస్సును, తుఫాన్ ఢీకొనడంతో ఒకరు, సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలంలోని లెనిన్‌నగర్‌లో లారీ, బైక్‌ను ఢీకొనడంతో మరొకరు దుర్మరణం పాలయ్యారు.

తొమ్మిది మందికి గాయాలు

- కందిలో ఆర్టీసీ బస్సు, తుఫాన్ ఢీ... ఒకరు మృతి, నలుగురికి గాయాలు
- కొమురవెల్లి మండలంలో లారీ, బైక్ ఢీకొనడంతో మహిళ దుర్మరణం
- పొలంపల్లిలో ఆటో బోల్తా పడి నలుగురు, కూచారంలో బైక్‌పై నుంచి పడి ఒకరికి గాయాలు



ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన వాహనం ముందుభాగం

కంది, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సును తుఫాన్ వాహనం ఢీ కొనడంతో ఒకరు మృతిచెందగా, మరో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని 65వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకున్నది. సంగారెడ్డి రూరల్ ఎస్సై మధుసూదన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును నారాయణఖేడ్ నుంచి బాలానగర్‌కు ప్రయాణికులతో వెళ్తున్న తుఫాన్ వాహనం కంది శివారులోని చేర్యాల గేటు వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన ఢీకొన్నది. దీంతో తుఫాన్ వాహనం ముందుభాగం నుజ్జునుజ్జు అయ్యింది. తుఫాన్‌లో ఉన్న నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన శనిగారం బాలయ్య(50) అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే మరో నలుగురుకి తీవ్ర గాయాలయ్యాయి. తూప్రాన్ మండలం అల్లాపూరు చెందిన ప్రవీణ్, న్యాల్‌కల్ మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన ఫరీద్, సిర్గాపూర్ గ్రామానికి చెందిన సీతారాం, రాయచూరుకు చెందిన కాలప్ప గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



శనిగారం బాలయ్య (ఫైల్)

బాలయ్య మృతితో చాంద్‌ఖాన్‌పల్లిలో విషాదం

నారాయణఖేడ్, నవంబరు 9(ఆంధ్రజ్యోతి) : కంది ప్రమాదంలో ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లికి చెందిన శనిగారం బాలయ్య(50) మృతిచెందంతో గ్రామ పరిధిలో విషాదచాయలు అలుముకున్నాయి. బాలయ్య నారాయణఖేడ్‌లో సీజనల్ పండ్లు, పూలు, విక్రయిస్తుంటాడు. హైదరాబాద్ నుంచి తీసుకురావడం కోసం తెల్లవారుజామున బయలు దేరగా ఈ ప్రమాదం జరిగింది. బాలయ్యకు భార్య భూమయ్య, కుమారుడు, కూతురు ఉన్నారు. చాంద్‌ఖాన్‌పల్లితో పాటు నారాయణఖేడ్ మార్కెట్లో విషాదచాయలు నెలకొన్నాయి.

లెనిన్ నగర్‌లో మహిళ

కొమురవెల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలంలోని లెనిన్‌నగర్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన ఘటన చోటు చేసుకున్నది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకోడూరు మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల రమేష్ తన భార్య పిల్లలతో కలిసి బైక్‌పై చేర్యాల వెళ్లి వస్తుండగా లెనిన్‌నగర్ గ్రామ శివారులో లారీ ఢీకొనడంతో ప్రమాద స్థలంలోనే రమేష్ భార్య ఎర్రోళ్ల సునీత మృతి చెందింది. రమేష్‌కు ఆయన కూతురికి తీవ్ర గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ పరారయ్యాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజుగౌడ్ తెలిపారు.



పొలంపల్లిలో అదుపుతప్పి బోల్తాపడిన ఆటో

దైవ దర్శనానికి వెళ్తున్న ఆటో బోల్తా

చేగుంట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన చేగుంట మండల పరిధిలోని పొలంపల్లి గ్రామ శివారులో మెదక్ రోడ్డులో ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న శంకరంపేట మండలం సంగాయిపల్లి గ్రామానికి చెందిన స్వామి(25), నర్సింలు(50), లక్ష్మి(60), నర్సమ్మ(40) కుటుంబసభ్యులతో కలిసి దైవ దర్శనం కోసం చేగుంట మండలం కర్నల్‌పల్లి రేణుక ఎల్లమ్మ ఆలయానికి వెళుతున్నారు. మార్గ మధ్యలో పొలంపల్లి సమీపంలోకి రాగానే ఆటో అదుపు తప్పి రోడ్డు కిందికి పల్టీ కొట్టి బోల్తా పడడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌లో గాయపడిన వారిని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న చేగుంట పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

హైవే 44పై ఒకరికి గాయాలు

మనోహరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్ర గాయాలైన ఘటన మండల కేంద్రంలో జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కూచారం వద్ద 44వ జాతీయ రహదారి బైక్‌పై నుంచి కిందపడి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలిసిన పోలీసులు ఘటనా స్థలం చేరుకుని వెంటనే యువకుడిని అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు. గాయపడిని వ్యక్తి మేడ్చల్ జిల్లా పూడురు గ్రామానికి చెందిన వ్యక్తిగా బైక్ నెంబర్ ద్వారా గుర్తించామని ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఏడుపాయలలో అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతదేహం లభ్యం

ఐదురోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లి.. చెక్ డ్యామ్‌లో శవమై

పాపన్నపేట నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఐదురోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన యువకుడు ఏడుపాయల ఆలయ సమీపంలోని చెక్‌డ్యాంలో శవమై తేలిన ఘటన ఆదివారం వెలుగుచూసింది. కుటుంబసభ్యులు, ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నార్సింగి గ్రామానికి చెందిన వడ్ల మహేష్(33) గ్రామానికి చెందిన స్నేహితుడు నర్సింలుతో కలిసి ఈనెల 5న కార్తిక పౌర్ణమి సందర్భంగా ఏడుపాయల ఆలయానికి వెళ్లారు. అక్కడి నుంచి మహేష్ హైదరాబాద్‌లో బంధువుల ఇంటికి వెళ్తానని చెప్పడంతో నర్సింలు ఒక్కడే తిరిగి గ్రామానికి వెళ్లాడు. కాగా మరుసటి రోజు బంధువులు వాకాబు చేయగా మహేష్ తన వద్దకు రాలేదని చెప్పారు. దీంతో ఆచూకీ కోసం వెతకడం ప్రారంభించారు. కుటుంబసభ్యులు శనివారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఏడుపాయల చెక్‌డ్యాం సమీపంలో నీటిలో తెలియాడుతున్న యువకుడి మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, ఆనవాళ్లను బట్టి మహేష్‌గా నిర్ధారించారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీట మునిగి ఉంటాడని పోలీసులు అభిప్రాయాన్ని వ్యక్తంచేయగా కుటుంబసభ్యులు మాత్రం మృతుడి మరణంపై అనుమానాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు. తల్లి వజ్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం



మర్పడగలో కాలిన గుడిసె

కొండపాక, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధమైన సంఘటన కొండపాక మండలం మర్పడగలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన డబ్బేర రేణుక తన ఇద్దరు పిల్లలతో గుడిసెలో నివాసం ఉంటుంది. శనివారం రాత్రి గ్రామంలో బోనాలు తీస్తుండగా రేణుక పిల్లలతో తన బంధువుల ఇంటికి వెళ్లింది. గుడిసెలో ఎవరూ లేని సమయంలో రాత్రి విద్యుదాఘాతంతో మంటలు లేచాయి. ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ఎలాంటి ఆధారం లేని ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి సందర్శించి బాధితురాలుకు తక్షణ సహాయం కింద నిత్యవసర సరుకులను అందజేశారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

మునిపల్లి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో ఓ లారీ డ్రైవర్ మృతిచెందిన సంఘటన మునిపల్లి మండలం కంకోల్ గ్రామ శివారులో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. మునిపల్లి ఎస్ఐ రాజేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం ఆజాంగాడ్ జిల్లా గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన రామ్ నగినా యాదవ్(53) ముంబయి నుంచి విశాఖపట్నంకు లోడుతో లారీని తీసుకెళ్తున్నాడు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ గ్రామ శివారులో సుహాన దాబా వద్ద భోజనం చేసి లారీని తీస్తుండగా, ఛాతిలో నొప్పి రావడంతో కుప్పకూలాడు. అక్కడ ఉన్న వారు సీపీఆర్ చేసినా ఫలితం లేకుండా పోయింది. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె..

చేర్యాల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతానికి గురై గేదె మృతిచెందిన సంఘటన ఆదివారం చేర్యాల పరిధిలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. పట్టణానికి చెందిన వంగాల మల్లయ్యకు చెందిన గేదె గడ్డిమేస్తూ వ్యవసాయ బావి ఆవరణలో సంచరిస్తుండగా పాడిగేదె విద్యుత్ తీగ తగిలి షాక్‌కుగురై మృత్యువాతపడింది. దీంతో రూ.లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతు మల్లయ్య వేడుకుంటున్నాడు.

చలికాలం... జరభద్రం

- **జాగ్రత్తలు పాటించాలి**

మిరుదొడ్డి, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి): చలికాలం అంటే కొంతమందికి ఇష్టమే అయినా, ఆరోగ్యపరంగా అనేక సవాళ్లను తీసుకొస్తుంది. రోజురోజుకు చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో, ముఖ్యంగా ఆస్తమా, దీర్ఘకాలిక సమస్యలతో బాధపడేవారు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయాన్నే లేచి పొగమంచుతో హాయిగా గడిపేస్తుంటారు కానీ, సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బందులు తప్పవు. చలికాలంలో తీసుకోవాల్సిన కీలక జాగ్రత్తల గురించి వైద్యులు పలు సూచనలు చేస్తున్నారు.



అప్రమత్తంగా ఉండాలి

చలికాలంలో జలుబు, శ్వాసకోశ, న్యుమోనియా, చర్మవ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. జలుబు, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి. డాక్టర్ సూచనల మేరకే మందులు తీసుకోవాలి.

\- డాక్టర్ సమీనా సుల్తానా, మిరుదొడ్డి పీహెచ్‌సీ వైద్యాధికారి

చలికాలం తప్పనిసరిగా పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలు

- చలికాలంలో రక్తనాళాలు కుంచించుకుపోవడం వలన రక్త ప్రసరణ తగ్గి, రక్తపోటు పెరుగుతుంది. దీని కారణంగా గుండెపై భారం పెరిగి, గుండెపోటు వచ్చే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది. ఈ సమస్యను అధిగమించడానికి వ్యాయామం (వాకింగ్) తప్పనిసరి. ఎండ వచ్చిన తర్వాతే (ఉదయం 8 గంటల తర్వాత) వాకింగ్‌ను ప్రారంభించాలి.
- గుండె జబ్బులు, అధిక రక్తపోటు (హైపర్‌టెన్షన్), మధుమేహం (డయాబెటిస్) ఉన్నవారు అత్యంత అప్రమత్తంగా ఉండాలి.
- శ్వాసకోశ, న్యుమోనియా ఉన్నవారు చల్లని వాతావరణం, పొగమంచులో ఎక్కువసేపు గడపొద్దు. పిల్లలు, వృద్ధులు త్వరగా న్యుమోనియా బారిన పడే అవకాశం ఉంది. జలుబును నిర్లక్ష్యం చేస్తే అది న్యుమోనియాకు దారితీయవచ్చు. ఇన్‌హేలర్లను, మందులను అందుబాటులో ఉంచుకోవాలి.
- చలి తీవ్రత వల్ల చర్మం పొడిబారి, పగుళ్లు, దురద, ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంటుంది. నిత్యం మాయిశ్చరైజర్, లోషన్లు వాడాలి. పెదాలకు లిప్‌బామ్ రాయాలి. గోరువెచ్చని నీటితోనే స్నానం చేయాలి.
- చలి ఎక్కువగా బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా వెచ్చని దుస్తులు (స్వెటర్లు, ఉన్ని దుస్తులు), మంకీ క్యాప్‌లు, స్కార్ఫ్‌లు ధరించాలి. ముక్కు, నోటిని రుమాలు లేదా మాస్కుతో కప్పుకోవాలి. ఇది చల్లని గాలి నేరుగా ఊపిరితిత్తుల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటుంది.
- నిత్యం గోరువెచ్చని నీటిని తాగాలి. అప్పటికప్పుడు వండిన వేడి ఆహారం తీసుకోవాలి. కూల్‌డ్రింక్‌లు, ఐస్‌క్రీములు వంటి చల్లని ఆహార పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలి. ఆహారంలో వేడిని ఇచ్చే అల్లం, వెల్లుల్లి, బెల్లం వంటివి చేర్చుకోవడం మంచిది.
- శరీర రోగనిరోధక శక్తిని పెంచేందుకు విటమిన్-సి అధికంగా ఉండే పండ్లు (ఉసిరి, నారింజ, నిమ్మ), తాజా కాయగూరలు తీసుకోవాలి.
- ఏసీ గదులు, చల్లని ప్రదేశాలలో ఉండకుండా చూసుకోవాలి.
- వాహనాలు నడిపేటప్పుడు చేతులకు గ్లౌజులు ధరించడం చాలా ముఖ్యం.



న్యూస్ బాక్స్

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

నారాయణఖేడ్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఝరాసంగం మండలం కక్కెరవాడలో కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారని అబ్బాయి కుటుంబీకులపై భౌతిక దాడిచేసి ఇంటిని తగులబెట్టిన అమ్మాయి తరఫు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొటారి నర్సింలు డిమాండ్ చేశారు. ఆదివారం ఖేడ్ నియోజకవర్గ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కుల వివక్షత నేటికీ కొనసాగుతుండడం దారుణమన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని ఇక ముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల డివిజన్ బాధ్యులు గణపతి, అశోక్ పాల్గొన్నారు.

నేడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు

జహీరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలో డీసీఎంఎస్ రైతు సేవా కేంద్రంలో నేడు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని బిజినెస్ మేనేజర్ ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని భవానీ మందర్ వద్దగల డీసీఎంఎస్ కేంద్రంలో కొనుగోలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం క్వింటాల్ మొక్కజొన్నలకు మద్దతు ధర రూ.2,400 కల్పిస్తుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

13న శివ పార్వతుల కల్యాణం, కార్తీక దీపోత్సవం

నారాయణఖేడ్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో 13న కార్తీక గురువారం రోజున సాయంత్రం 5 నుంచి శివ పార్వతుల కల్యాణం, కార్తీక దీపోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ బాధ్యులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాంమహరాజ్, అంతర్గాం పీఠాధిపతి కరణ్‌గజేంద్ర భారతిమహరాజ్, ఇరక్‌పల్లి దేవిదాస్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హరిహరాదుల కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.

నేటి నుంచి సప్తాహ

మండల పరిధిలోని లింగాపూర్‌లో భక్త మార్కండేయ ఆలయ 4వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సప్తాహతో పాటు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నామని ఆలయ అర్చకులు సంగయ్య స్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 వరకు ప్రతిరోజు కీర్తన, ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఉంటాయని, అందువల్ల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రోడ్డును బాగు చేసిన యువకులు

పాపన్నపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాలకు మెదక్-బోడ్‌మెట్ ప్రధాన రహదారిపై, పాపన్నపేట మండలం ఎల్లాపూర్ వద్ద రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. అయితే అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో పాటు నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టడం లేదు. ఆ రోడ్డుపై వెళ్లే వాహనదారులు గుంతల్లో పడి గాయాలపాలయ్యాయి. ఇది గమనించిన గ్రామానికి చెందిన కొంతమంది యువకులు ట్రాక్టర్‌తో మట్టి తెచ్చి రోడ్డుపై గుంతలను పూడ్చారు.

సొంత ఖర్చుతో రోడ్డు పనులు


మనోహరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ముప్పిరెడ్డిపల్లి నుంచి కాళ్లకల్ గ్రామం వరకు కిలోమీటరు రోడ్డు వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నది. అధికారులు పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో కాళ్లకల్ గ్రామానికి చెందిన మద్దూరి నాగరాజుగౌడ్ తన సొంత డబ్బు రూ.50 వేలతో మట్టి రోడ్డు పనులు చేశారు.

దీపం పరమజ్యోతి స్వరూపం

రేగోడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : దీపం పరమజ్యోతి స్వరూపమని, శ్రావణంలో ప్రతి ఒక్కరు దీపాలు వెలిగించాలని దుద్యాల సర్వేశ్వరపురం పీఠాధిపతి అంబికా శివయోగిమహరాజ్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం దుద్యాల ఆశ్రమంలో ఈనెల 13 నుంచి 17 వరకు హరిహర బ్రహ్మ శివకేశవ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 16న భూలక్ష్మీదేవి అఖండ కోటి దీపారాధన నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు భద్రకాళి వీరభద్రేశ్వర స్వామి కల్యాణం

రేగోడు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీ భద్రకాళి వీరభద్రేశ్వరస్వామి కల్యాణాన్ని రేగోడు గోకర్ణేశ్వర, వీర హనుమాన్ ఆలయంలో సోమవారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి మహేష్‌స్వామి తెలిపారు. కల్యాణంతోపాటు ప్రత్యేక పూజలు, హోమం, అన్నదానం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.




కోహీర్ మండలంలోని సజ్జాపూర్ గ్రామం, ఖానాపూర్‌లో అధ్వానంగా మురుగు కాలువ

నిధులు లేక.. నిర్వహణ చెయ్యలేక..

- సమస్యల సుడిలో పంచాయతీలు
- ఇబ్బందులు పడుతున్న కార్యదర్శులు
- ఒక్కో కార్యదర్శి పెట్టిన ఖర్చు రూ.4-5 లక్షలు

కోహీర్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీల నిర్వహణకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాత సర్పంచుల పదవీకాలం 2024 ఫిబ్రవరి మొదటి తేదీకి పూర్తికావడంతో పల్లెల్లో ప్రత్యేక అధికారుల పాలన ఏర్పాటు చేశారు. అప్పటి నంచి ఇప్పటివరకు ఆయా గ్రామాలకు ఒక రెండుసార్లు మొక్కుబడిగా కొన్ని నిధులు విడుదలయ్యాయి. అవి కూడా పెండింగ్ బిల్లుల కిందనే ఖర్చు అయిపోయాయి. ప్రస్తుతం గ్రామాల అభివృద్ధికి నిధులు లేకపోవడం వల్ల పంచాయతీ కార్యదర్శులు నెత్తి పట్టుకుంటున్నారు. మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో పంచాయతీల నిర్వహణకు కార్యదర్శులు అప్పులు చేస్తున్నారు. ఇప్పటి వరకు ఒక్కో గ్రామ కార్యదర్శి రూ.4-5 లక్షల వరకు అప్పుచేశాడు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి గ్రామాలకు నిధులు రాకపోవడంతో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సంఘం నిధులు కూడా విడుదల కావడం లేదు.

తలనొప్పిగా పల్లెల నిర్వహణ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి పల్లెల పాలనకు నిధులు విడుదల కాకపోవడం వల్ల చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం కార్యదర్శులకు ఇబ్బందులు తప్పడం లేదు. నిధులు రాకపోవడం వల్ల 22 నెలల ప్రత్యేక అధికారుల పాలనలో కార్యదర్శులకు పల్లె నిర్వహణ ఒక సవాల్‌గా మారింది. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఎదురైనా గ్రామస్థులు కార్యదర్శులకు ఫిర్యాదు చేస్తున్నారు. వారి వద్ద నిధులు లేకపోవడం వల్ల గ్రామస్థులతో తిట్లు తినడమే తప్ప పనులు చేయలేని పరిస్థితి దాపురించింది.

ఎన్నికలు నిర్వహిస్తేనే సమస్యకు పరిష్కారం

పల్లెల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారం కావాలంటే రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పల్లెల్లో స్థానిక ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే కనీసం కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం గ్రామాల్లో రోడ్ల, వీధిలైట్ల, మురుగు కాలువల, తాగునీరు వంటి తదితర సమస్యలు రాజమేలుతున్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలి



పల్లె పాలనకు రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి, కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధుల నుంచి నిధులు మంజూరు చేయాలి. అంతేకాకుండా సకాలంలో సర్పంచులు ఎన్నికలు నిర్వహించాలి.

- రమేష్, బడంపేట

శ్రమశక్తినీతి- 2025 లేబర్ పాలసీ రద్దుచేయాలి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

పటాన్‌చెరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అమల్లో ఉన్న కార్మిక చట్టాలను రద్దుచేసి నూతనంగా కోడ్లను అమలు చేయడానికి బీజేపీ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు అన్నారు. ఆదివారం పటాన్‌చెరు ఐలా భవన్‌లో నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. పారిశ్రామికవర్గాలకు అనుకూలంగా నూతన చట్టాలను రూపొందించారని చెప్పారు. శ్రమశక్తి నీతి -2025 పేరుతో కోడ్‌ను అమల్లోకి తెచ్చిందని వివరించారు. దీనివల్ల కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడతారని చెప్పారు. కొత్తగా చేసిన చట్టాల కారణంగా వివిధ రాష్ట్రాల్లో 10 గంటల పనిదినంగా పరిగణిస్తున్నాయని వివరించారు. కేరళలో 8 గంటల సమయాన్ని అమలు చేస్తోందని చెప్పారు. నూతనంగా తెచ్చిన పాలసీ ఉపసంహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య, మాణిక్, వీఎస్‌రాజు, మల్లేష్, లఖాన్, శ్రీనివాస్, శ్యాంబాబు, రాజిరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చుక్కా రాములు

జూబ్లీహిల్స్‌లో ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జూబ్లీహిల్స్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన బీజేపీ శ్రేణులు అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డి తరఫున ప్రచారం చేశారు. ఆదివారం ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఆధ్వర్యంలో ప్రచార చివరిరోజు కావడంతో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. వికసిత్ భారత్‌కోసం బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో పద్మశాలీలు సత్తాచాటాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్

చిన్నశంకరంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో పద్మశాలీలు సత్తాచాటాలని పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లకాటి రాజ్‌కుమార్ అన్నారు. ఆదివారం చిన్నశంకరంపేట మండలంలో పద్మశాలీ సంఘం సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పద్మశాలీలు రాజకీయంగా వెనకబడి ఉన్నారన్నారు. ప్రభుత్వం పద్మశాలీలను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. అనంతరం సంఘ సభ్యులతో కలిసీ మార్కండేయస్వామికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం పట్టణ అధ్యక్షుడు కిష్టయ్య, సంఘం సభ్యులు వనం నర్సింహులు, శ్రీమన్నారాయణ, బాలరాజ్, కృష్ణ, వెంకటరాములు, పాల్గొన్నారు.



చిన్నశంకరంపేట మార్కండేయ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న రాజ్‌కుమార్

ఘనంగా కార్తీక వన భోజనాలు



మాట్లాడుతున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి

నారాయణఖేడ్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తుర్కపల్లి సంగమేశ్వర ఆలయంలో జంగమ సమాజం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలు ఆదివారం నిర్వహించారు. ఇందులో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కార్తీకమాసంలో జంగమ సమాజం వారు కార్తీక వన భోజనాల కార్యక్రమాన్ని చేపట్టడం ఆనందకరమన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి, సోదరుడు సుధాకర్‌రెడ్డి, సంగమేశ్వర ఆలయ ధర్మకర్త డాక్టర్ విఠల్‌తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జంగమ సమాజం నియోజకవర్గ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా పనులో ఇక్కట్లు

నిజాంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నిజాంపేట మండల కేంద్రంలోని మల్కా చెరువు మత్తడి ప్రమాదకరంగా ప్రవహించడంతో వరద తాకిడికి నిజాంపేట-నస్కల్‌కు వెళ్లే రహదారి వంతెన కొట్టుకుపోయింది. దీంతో ఆర్‌అండ్‌బీ అధికారులు తాత్కాలికంగా మట్టితో రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ రహదారిపై వాహనాల రాకపోకలు కొనసాగడంతో అది కాస్త కుంగి కోతకు గురై అటుగా వెళ్తున్న వాహనదారులు నరకం చూస్తున్నారు. రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన చోట ఇరువైపుల రక్షణ నిర్మాణం కూడా చేపట్టకపోవడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే ప్రమాదం జరిగే అవకాశం ఉన్నది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కూలిన వంతెనచోట పూర్తిస్థాయి రోడ్డు పనులు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



కోతకు గురైన తాత్కాలిక రహదారి

పరిశ్రమల భూముల్లో రియల్ వ్యాపారంపై విచారణ జరపాలి

పటాన్‌చెరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామిక అభివృద్ధికి రైతుల నుంచి సేకరించిన భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వారిపై విచారణ జరపాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి కోరారు. ఆదివారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పటాన్‌చెరు పారిశ్రామికవాడలో ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇష్టారీతిన అనుమతులు మంజూరు చేసిందని వివరించారు. 105 ఎకరాల ర్యాలికెమ్ అనే పరిశ్రమ భూముల్లో ఎటువంటి ఎన్‌వోసీలు లేకుండా అనుమతులు మంజూరయ్యాయని వివరించారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న సంస్థకు ఇచ్చిన భూములను వెనక్కి తీసుకొని, బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవకతవకలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని కోరారు. ఆయనతో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవిగౌడ్, సహదేవ్‌రెడ్డి, వంశీ తదితరులు ఉన్నారు.

బీజేపీ బలోపేతమే లక్ష్యం

గుమ్మడిదల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ బలోపేతమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని పార్టీ మండల నాయకులు పిలుపునిచ్చారు. గుమ్మడిదల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు కావలి ఐలేష్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పలుగు గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అభివృద్ధి, పార్టీ విస్తరణకు సంబంధించిన అంశాల గురించి చర్చించారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, రాజు, ఉపాధ్యక్షుడు కృష్ణ, సంజీవ, బూత్ అధ్యక్షుడు మురళీచారి, శివరాత్రి రాజు, మండల నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న బీజేపీ శ్రేణులు

చిన్నశంకరంపేట, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చిన్నశంకరంపేట మండలం వెంకట్రావుపల్లి గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ కార్యకర్త అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. బీజేపీ జిల్లా నాయకుడు గుడికాడి లింగంగౌడ్ మృతుడి కుటుంబసభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మృతుడి కుటుంబానికి బీజేపీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు సురేష్ గౌడ్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మూర్తి శంకర్, నాయకులు రమేష్, సుధాకర్, నాగరాజు, బాబు, సాయిలు పాల్గొన్నారు.

రోడ్డును తవ్వి వదిలేశారు..!

రామచంద్రాపురం టౌన్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ మున్సిపల్ పరిధి ముత్తంగి న్యూటౌన్‌షిప్‌లో రోడ్డు వేయడానికి వీలుగా గుత్తేదారుడు ఉన్న రోడ్డును తవ్వి వదిలిపెట్టారు. దీంతో ఇళ్లల్లోకి మురుగునీరు వస్తుండడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. త్వరితగతిన రోడ్డు నిర్మాణం చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వైభవంగా రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

కంది, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలోని రుక్మిణీ పాండురంగస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయ ధర్మకర్తలు దీపక్‌దేశ్‌ముఖ్, సునీల్ దేశ్‌ముఖ్ స్వామివారి కల్యాణం వైభవంగా జరిపించారు. ఈ కల్యాణాన్ని తిలకించేందుకు జిల్లావ్యాప్తంగా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. మహిళలు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ధర్మకర్తలు అన్నప్రసాద వితరణ చేశారు. సోమవారం గరుడ సేవ, మంగళవారం మధ్యాహ్నం పూర్ణాహుతి, అష్టదిక్పాలక బలిహరణ హోమం, రాత్రి రథోత్సవం, బుధవారం చక్రతీర్థం, నాగవెళ్లి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రావుపంతులు, సురేష్‌పంతులు, విజయ్‌పంతులు, నవీన్‌పంతులు, శ్రీనుపంతులు, గ్రామస్థులు రఘురాంరెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, యాదగిరి, వడ్ల సుదర్శన్‌చారి పాల్గొన్నారు.

నిమ్జ.. నీరసం..

(5వ పేజీ తరువాయి)

అధికారులు 7వేల ఎకరాల భూసేకరణను చేపట్టారు. మరో 5వేల పైచిలుకు ఎకరాల్లో భూసేకరణ చేపట్టాల్సి ఉంది. 2016-17లో ఝరాసంగం న్యాల్‌కల్ మండలాల పరిధిలోని చీలపల్లి(585.04), ఎల్గోయి(1,838.32), బర్దీపూర్(319.05), న్యాల్‌కల్ మండలంలోని రుక్మాపూర్(310.10), ముంగి(445.22) గ్రామాల్లో 3500 ఎకరాల భూసేకరణను చేపట్టారు. 2016 నుంచి 2022 వరకు గంగ్వార్ (38.17), మల్కన్‌పాడ్ (216.05), బసంతాపూర్(248.11), గణేష్‌పూర్(597.39), హంసెళ్లి(731.29), గుంజెట్టి(291.33), హద్నూర్ (577.29), న్యామ్తాబాద్ (1,221.10), మామిడిగి(1,487), కల్‌బేమల్(415.16), మెటల్‌కుంట(658.27), రేజింతల్(1,734.34),ఎకరాల చొప్పున గ్రామాల్లో భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం మిగతా భూసేకరణ పనుల్లోనే అధికారులు నిమగ్నమయ్యారు.

ఎకరాకు రూ.15లక్షల పరిహారం

ఎకరాకు రూ.15లక్షల చొప్పున పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రస్తుతం వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ధరలు కోట్లలో పలుకుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇచ్చే డబ్బును తీసుకోకపోతే రైతులు కోర్టులో జమచేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. టీఎస్ఐఐసీ వారు 511 ఎకరాలు వెమ్ టెక్నాలజీకి 408 హ్యూందాయ్ కర్మాగాలకు స్థలాలు కేటాయించారు. ఇటీవల నిమ్జ్ కార్యాలయంపై ఏసీబీ దాడులు జరిగిన నేపథ్యంలో భూసేకరణ ప్రక్రియ నత్తనడకన జరుగుతుంది. దీంతో కొత్త పరిశ్రమల ఏర్పాటు కలగానే మిగిలింది. నాగ్‌పూర్-హైదరాబాద్ ఇండస్ట్రీయల్ కారిడార్‌లో భాగంగా రియల్టర్లు భారీగ పెట్టుబడులు పెట్టగా అందుకు అనుగుణంగా అభివృద్ధి జరుగనుందా అని పలువురు ఎదురుచూస్తున్నారు.

పరిహారం కోసం రైతులు పడిగాపులు

నిమ్జ్ ప్రాజెక్టులో విలువైన వ్యవసాయ భూములను కోల్పోయిన రైతులు పరిహారం కోసం ప్రతిరోజు జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన నిమ్జ్ కార్యాలయానికి వస్తూ అధికారులతో గొడవలకు దిగుతున్నారు. భూములకు సంబంధించి పరిహారం ఇవ్వడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారంటై కార్యాలయా నికి వచ్చి అధికారులను నిలదీస్తున్నప్పటికీ స్పందన కొరవడింది. రోజూ నిమ్జ్ కార్యాలయం రైతులతో సందడిగా ఉంటుంది. పరిహారం చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండడంతో అధికారులు సర్దిచెబుతున్న పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారులు, నాయకులు స్పందించి నిమ్జ్‌ప్రాజెక్టును త్వరలో పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. నిమ్జ్ ఏర్పాటైతే ఉద్యోగ, ఉపాధిఅవకాశాలు మెండుగా లభిస్తాయని స్థానికులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

పనులు పూర్తి.. ఇక వైద్యసేవలే..?



పూర్తయిన బస్తీ దవాఖానా భవనం

జిన్నారం, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం జిన్నారం పరిధిలోని దర్గా కాలనీ వద్ద రూ.20 లక్షలతో చేపట్టిన బస్తీ దవాఖానా భవనం పనులు పూర్తయి రెండు నెలలు కావస్తున్నా.. నేటికీ ప్రారంభించలేదు. దీంతో ప్రజలు వైద్య సేవలకు నోచుకోవడం లేదు. స్థానిక పీహెచ్‌సీకి ఒక కిలోమీటరు దూరంలోని కాలనీలో బస్తీవాసుల కోసం ఈ దవాఖానాను నిర్మించారు. నూతన భవనం అందుబాటులోకి రాకపోవడంతో కాలనీవాసులు పాత ఆరోగ్య కేంద్రానికి వెళ్తున్నారు. అధికారులు, నాయకులు స్పందించి కొత్త కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

పదిరోజులైనా ఆగని లీకేజీ..



శివాజీ విగ్రహం వద్ద వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

గుమ్మడిదల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గుమ్మడిదల మున్సిపాలిటీలోని శివాజీ విగ్రహం వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకై నీరంతా వృథాగా పోతోంది. పదిరోజులుగా నీరు పోతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ నీరు బస్టాండ్ ప్రాంగణాన్ని బురదమయంగా మార్చేసింది. ప్రయాణికులు, వ్యాపారులు సైతం వృథా నీటితో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పంట పొలాల్లోకి నీరు చేరడంతో కోతకు ఆటంకం ఏర్పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



సాయిబాబా విగ్రహానికి 108 కలశాలతో అభిషేకం చేస్తున్న బాల్‌రెడ్డి

పటాన్‌చెరు, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఐడీఏబొల్లారం పురపాలక పరిధి సాయిబాబా ఆలయంలో ఆదివారం ద్వాదశ వార్షికోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి మాజీ జడ్పీటీసీ కొలన్ బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. వేదమంత్రోశ్చరణల మధ్య పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లో రాణించాలి

గుమ్మడిదల, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : యువత క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని సీజీఆర్ ట్రస్టు చైర్మన్ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీలోని సీజీఆర్ ట్రస్టు కార్యాలయంలో ఆదివారం క్రీడాకారులకు ఆదివారం క్రీడా దుస్తులు పంపిణీ చచేసి మాట్లాడారు. యువత క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయస్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కుంటి మల్లేష్, బాబుయాదవ్, మురళీయాదవ్, అరవింద్‌రెడ్డి, ప్రభాకర్‌చారి, ఆగం యాదవ్, నవీన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పకుండా చేయించాలి

జహీరాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు వారి వారి పంట పొలాల్లో ప్రతియేటా భూసార పరీక్షలు చేయించుకోవాలని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్తలు, విద్యార్థులు పేర్కొన్నారు. ఆదివారం హోతి(బి),హుగ్గెల్లి గ్రామాల్లో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పొలాల్లో భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల నేలలోని పోషక లోపాలను గుర్తించవచ్చన్నారు. ఇలాంటి సమయాల్లో ఎలాంటి ఎరువులను ఏయే మోతాదుల్లో వాడాలనే విషయం తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త స్వామి, మల్లారెడ్డి కళాశాల విద్యార్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.